క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి లను పల్లకిలో అధిష్టింపజేశారు. వేద మంత్రోచ్ఛ రణలు, నాదస్వర వాయిద్యాల మధ్య తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

6న విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-2, గుల్లేపల్లి ఫీడర్ పరిధి 11 కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 6(శుక్రవారం)న సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, ఎల్లుప్పి, మర్రిపాలెం, అయ్యన్నపాలెం గ్రామాలలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

అంగన్‌వాడీలో రక్తపరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-2లో పోషకాహార మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. మాసోత్సవాల్లో భాగంగా 5 ఏళ్ల లోపు పిల్లలకు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలలకు, 45 ఏళ్లలోపు స్త్రీలకు రక్తపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.కె.షకీలా, ఏఎన్ఎం రత్నం, ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్త కె.లక్ష్మి, ఆశా వర్కర్ ఎ.సన్యాసమ్మ, పద్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



వర్మీ కంపోస్ట్ ఫిట్‌లలో వానపాముల్ని విడిచిపెడుతున్న ఈవోపీఆర్డీ మహేష్

సబ్బవరం: సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చని ఈవోపీఆర్డీ మహేష్ తెలిపారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ఫిట్‌లలో మంగళవారం ఆయన వానపాముల్ని విడిచిపెట్టారు. అనంతరం గ్రామంలో చేపలు, మాంసం, టిఫిన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి, చెత్తబుట్టలను వినియోగించాలని, వ్యర్థాలను జనసంచారం లేనిచోట పారబోయాలని సూచించారు. షాపుల పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలని, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను దుకాణాల యజమానులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండి అరుణ, పంచాయతీ కార్యదర్శి సంతోషి, వార్డు సభ్యులు అంగటి నానాజీ, సచివాలయ సిబ్బంది సాయి, రేష్మ, శివ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లు.. నరకానికి నకళ్లు

- మండలంలో అధ్వానంగా రోడ్లు
- దారి పొడవునా భారీ గోతులు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

పరవాడ మండల పరిధిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. చాలా రోడ్లు ఛిద్రమై, భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కనీసం తాత్కాలిక ఉపశమనం కోసమైనా ఎప్పటికప్పుడు గోతుల్ని పూడ్చేవారు. దీంతో ప్రమాదాలు తప్పేవి. కూటమి ప్రభుత్వంలో ఆ భాగ్యానికీ నోచుకోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజా వర్షాలకు రోడ్లు మరింతగా పాడై, వాహనదారులకు, ప్రయాణికులకు నరకాన్ని చవిచూపిస్తున్నాయి. అధికార యంత్రాంగం కాస్త చొరవచూపి, గోతుల్ని పూడ్చాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు.



రాళ్లు తేలిన వెంకటాపురం రహదారి



పూర్తిగా దెబ్బతిన్న పాతరాజన్నపాలెం రోడ్డు



లంకెలపాలెం-అసకపల్లి రోడ్డులో భారీ గోతులతో వాహనదారుల ఇక్కట్లు

పరవాడ: మండలంలో రోడ్లు పాడవడంతో గ్రామీణ ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఏ రోడ్డు చూసినా మోకాలి లోతు గుంతలు.. రాళ్లు తేలి రోడ్లపై నడవాలన్నా, వాహనాలను నడపాలన్నా.. భయపడే పరిస్థితి. బూడిద, బొగ్గు లోడ్ల భారీ వాహనాల రాకపోకలతో అనేక రహదారులు ధ్వంసం అయ్యాయి. అచ్యుతాపురం, పెదగంట్యాడ ప్రాంతాల్లోని ఎస్ఈజెడ్, హిందూజా పరిశ్రమలకు అవసరమైన బొగ్గు, ఇతర లోడ్లతో భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో సబ్బవరం-పరవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే రహదారిలో ఎన్టీపీసీ నుంచి రాకపోకలు సాగించే బూడిద లారీలతో రోడ్డు మరింత దారుణంగా తయారై, ప్రయాణికులను ముప్పుతిప్పలకు గురిచేస్తోంది.

అడుగడుగునా గోతులు.. పట్టించుకోక పాట్లు

భారీ వాహనాల రాకపోకల కారణంగా సబ్బవరం, అసకపల్లి, పెదముషిడివాడ, లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం గ్రామాల రహదారులు పూర్తిగా పాడయ్యాయి. అధ్వానంగా మారిన రోడ్లపై ప్రయాణాల్లో గోతుల్లో వాహనాల చక్రాలు ఇరుక్కుని ట్రాఫిక్ జాం అవుతోంది. ఇటీవల ఊటగెడ్డ కూడలిలో భారీ వాహనాల వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తి గంటల కొద్దీ ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- పెదముషిడివాడ - లంకెలపాలెం గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి మరీ దారుణంగా తయారైంది. లంకెలపాలెం కూడలిలో రోడ్డు ధ్వంసమై మరమ్మతులకు ఎదురు చూస్తోంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న రోడ్డు అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు, స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. చాలా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.
- పరవాడ నుంచి ఊటగెడ్డ జంక్షన్ వరకు రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు చేరి, రోడ్డేదో.. గొయ్యేదో.. తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- పరవాడ సమీపంలోని పైడిమాంబ ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డులో వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన వర్షపు నీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- సినిమాహాలు కూడలి నుంచి ఊటగెడ్డ కూడలి మధ్యలో ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. రోజూ రోజు ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య పరిశ్రమల్లో విధులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులతో రోడ్డు రద్దీగా ఉంటుంది.
- ఎన్టీపీసీ-వెన్నలపాలెం రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. రోడ్డులో పలుచోట్ల గుంతలు ఏర్పడి, రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- వాడచీపురుపల్లి-వెంకటాపురం రోడ్డు రాళ్లు తేలిపోయి, భారీ గుంతలు ఏర్పడింది. దీనికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- నాయుడుపాలెం-పాతరాజన్నపాలెం రోడ్డు పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పటికైనా ఈ రోడ్డును పునర్నిర్మించాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.



అధ్వానంగా పరవాడ-యలమంచిలి రోడ్డు

ధ్వంసమైన రోడ్లతో నరకయాతన



నేను పెదముషిడివాడ గ్రామంలో పాన్ షాపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాను. వందలాది బొగ్గు, బూడిద తరలించే భారీ లారీలతో నిత్యం రోడ్డు రద్దీగా ఉంటుంది. వీటి వల్ల ఎగసిపడే బూడిదనే పీల్చుకుంటున్నాం. నాలాంటి పాన్‌షాపులు, రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు బూడిద పాలవుతున్నాయి. భారీ వాహనాల వల్లే రోడ్లు గుంతలు పడుతున్నాయి. రాకపోకలకు నరకయాతన పడుతున్నాం.

– పల్లా శ్రీనివాస్, పెదముషిడివాడ

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



గత కొన్నేళ్లుగా పరవాడలోనే ఉంటున్నాను. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఇంత దారుణమైన రోడ్డును చూడలేదు. సినిమా హాలు నుంచి ఊటగెడ్డ జంక్షన్ వరకు పెద్ద పెద్ద గుంతలు, ఎక్కడికక్కడ ధ్వంసమైన రోడ్డుతో అవస్థలు పడుతున్నాం. తాజా వర్షాలకు నీరు నిలవడం, అదే సమయంలో భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు మరింత పాడైంది. ఉద్యోగులు, కార్మికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆడారి రామచంద్రరావు, పరవాడ

పెందుర్తి పట్టణ ప్రాంత అభివృద్ధికి నిధులివ్వండి

- మేహాద్రి రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేపట్టాలి
- జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే పంచకర్ల వినతి



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గంలోని జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నగర ప్రజలకు తాగు నీరందిస్తున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుల వారీగా రోడ్లు, కాలువలు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి పనుల జాబితాను కమిషనర్‌కు అందించారు. త్వరితగతిన నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టాలని విన్నవించగా కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే స్థానిక మీడియాకు వెల్లడించారు.

పౌష్టికాహారంతోనే పుట్టే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు తీసుకోవాల్సిన మాత్రలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

సబ్బవరం: గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పుట్టే బిడ్డలు బలంగా, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సబ్బవరం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పైడితల్లి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని గంగిరెడ్లకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇళ్ల వద్దకే ఇచ్చే రేషన్ సరకులను వినియోగించుకోవడం ద్వారా గర్భిణీల్లో రక్తపుష్టి పెరిగి, బిడ్డలు ఆరోగ్యవంతంగా పుడతారని తెలిపారు. తీసుకునే ఆహారంలో ఆకుకూరలకు తగు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మునగ, రాగి జావ తీసుకుంటే రక్తంలో ఐరెన్ శాతం వృద్ధి చెందుతుందన్నారు. వీటితోపాటు అంగన్‌వాడీల్లో ఇచ్చే మాత్రలు, టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలలో అందుబాటులో ఉండే మాత్రలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కేవీ రత్నకుమారి, డి.పరదేశమ్మ, వై.రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌కు గ్రేడ్-1 అధికారిగా పదోన్నతి



పదోన్నతి పొందిన సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

పెందుర్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బీజీఎస్‌వీ ప్రసాద్‌కు గ్రేడ్-1 అధికారిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. దుశ్శాలువ వేసి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఉపాధ్యక్షుడు బలగా చిన్నారావు, కార్యదర్శి పెంటకోట శ్రీనివాసరావు, సీనియర్ లేఖర్లు పితాని నాగరాజు, పొన్నగంటి సురేష్‌కుమార్, గంటి శర్మ, గొర్లి శంకర్, బి.సోమేష్, అముజురి శ్రీను, డి.సుధీర్, ముక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం ఎమ్మెల్యే తీరుపై నిరసన

తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



మద్దిలపాలెం డిపో-1 వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యేకు చెందిన ఆరు బస్సులకు ఆర్టీసీ అద్దెకు తీసుకుంది. ఈ బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా విధుల నుంచి తొలగించడాన్ని హైర్ బస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేజేఏ అప్పారావు, రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీపీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరాంలు తీవ్రంగా ఖండించారు. అద్దెబస్ యజమాని టీడీపీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చర్యలను ఖండిస్తూ మంగళవారం విశాఖ-1 డిపో గేటు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలగించిన ఐదుగురు డ్రైవర్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అర్జున్, రవి, శంకర్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి

మల్కాపురం: సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి చెప్పారు. జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని జనతాకాలనీలో మంగళవారం ఏడీసీ పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన నిందితుల్ని కఠినంగా శిక్షించాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, మహిళలు

పరవాడ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ మౌమితపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోల్‌కతా మహానగరంలో డాక్టర్ మౌమితను అమానవీయంగా హత్య చేసిన దోషులను వెంటనే కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. భారతవని సిగ్గుపడేలా మహిళలపై జరుగుతున్న అకృత్యాలను, అఘాయిత్యాలను కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెన్నల లక్ష్మి, మణి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వుడా కాలనీ రోడ్డు



చీకటిగా మాధవధార వుడా కాలనీ రోడ్డు

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ 48వ నంబరు లాస్ట్ బస్టాప్ రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. సుమారు అర కిలోమీటరు మేర ఇదే పరిస్థితి నెలకొనడంతో రాత్రి వేళ చీకటిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు, వాహనచోదకులు, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే చీకటిగా ఉండడంతో మహిళలు ఒంటరిగా అటువైపు వెళ్లడానికి భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విజయోత్సవ సభ

సింధియా: ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం ఇటీవల జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా బుధవారం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్ తెలిపారు. 104 ఏరియా సమీపంలోని మేఘాద్రిపేట డిఫెన్స్ సివిలియన్ కాలనీలో గల కళా మేఘ ఆడిటోరియంలో జరగనున్న సభకు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, అఖిల భారత డిఫెన్స్ మజ్దూర్ సంఘం ప్రతినిధులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దళారీ వ్యవస్థతో కాంట్రాక్టు కార్మికులకు నష్టం

సీతంపేట : దళారీల చేతిలో నలిగిపోతూ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో వెట్టి చాకిరీ చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ కాంట్రాక్టు వర్కర్లకు పెరిగిన వేతనాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు ఇబ్బంది కలగకుండా సేవలందిస్తున్న సిబ్బందిని దళారీ వ్యవస్థలో పెట్టి అన్యాయం చేస్తున్నారన్నారు. పెరిగిన జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్ డబ్బులు, ఈఎస్ఐ కార్డులు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 549, 43 జీవోల ప్రకారం పెరిగిన వేతనాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు బుగత అశోక్ మాట్లాడుతూ ఇటీవల కాంట్రాక్టరు మారిన తర్వాత 38 నెలల నుంచి పీఎఫ్ ఎంత జమ అవుతోంది, ఈఎస్ఐ కోసం ఎంత కటింగ్ చేస్తున్నారో చెప్పడం లేదన్నారు. ప్లే స్లిప్పులు ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కాంట్రాక్టు వర్కర్లను దళారీ వ్యవస్థ నుంచి తప్పించి ఆప్కోస్‌లో చేర్చి ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.వామనమూర్తి, ఆర్.వి.ఎస్.కుమార్, కోన లక్ష్మణ పాల్గొన్నారు.

బాలలపై లైంగిక దాడుల నిర్మూలనకు నడుం బిగించాలి

- క్షేత్రస్థాయిలో బాలల హక్కులపై అవగాహన కలిగించాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

పెందుర్తి: బాలలపై ఇటీవల కాలంలో లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటి నిర్మూలనకు నడుం బిగించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పిలుపునిచ్చారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పురుషోత్తపురంలోని బాలాజీ హైఫీల్డ్స్ పాఠశాలలో మంగళవారం బాలల హక్కుల పరిరక్షణ-ప్రవేటు పాఠశాలల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలల చట్టాలు, హక్కులపై క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలన్నారు. పిల్లలు ఫిర్యాదులు చేసే విధంగా పాఠశాలల్లో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేసి, తగిన పర్యవేక్షణ ఉంచాలన్నారు. తరగతి గదుల్లో దండనల కారణంగా విద్యార్థులు భయాందోళనకు గురై డ్రాపౌట్లు పెరుగుతున్నాయని, దీన్ని బాలల హక్కుల కమిషన్ సీరియస్‌గా తీసుకుంటోందన్నారు. ఇలాంటి దాడుల వలన విద్యార్థుల్లో మానసిక ఆందోళన పెరిగి, అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తోందన్నారు. ప్రవేటు పాఠశాలల్లో ఫీజుల అంశం కేవలం తల్లిదండ్రులతో మాత్రమే మాట్లాడాలని, పిల్లలపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఫీజుల ఒత్తిడిపై కమిషన్ సుమోటోగా స్వీకరించి, సంబంధిత పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సదస్సులో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం, పెందుర్తి ఎంఈవో-2 టి.మధుమూర్తి, ఎక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ జి.డేవిడ్‌రాజు, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సీడీపీవో డి.నీలవేణి, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందీ టీచర్‌కు పదవీ విరమణ సత్కారం



ఉమాదేవి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

పరవాడ: అంకితభావం, నిస్వార్థంతో సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని పరవాడ మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు అన్నారు. వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన హిందీ టీచర్ కొర్లపు ఉమాదేవి, అప్పడు దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలం సేవలు అందించిన ఉమాదేవి విద్యార్థుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ పనిచేసిన ప్రతీ చోటా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత ఆమె దక్కించుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, పాఠశాల హెచ్ఎం కనకేశ్వరరావు, కమిటి చైర్మన్ లెక్కల సన్యాసి, సర్పంచ్ శివలంక లక్ష్మి, కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



13వ వార్డు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. వార్డులో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం పెదగదిలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ పెద్దల అండదండలతో గెలిపించుకున్న కార్పొరేటర్ పార్టీని వీడి వెళ్లిపోవడం మంచి పద్ధతికాదన్నారు. వైఎస్సార్‌సీపీ బి.ఫారంతో గెలిచిన 13వ వార్డు కార్పొరేటర్ ఇటీవల జరిగిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేశారన్నారు. ఆ ఎన్నికలు అయిపోయిన తర్వాత టీడీపీ వార్డు నాయకులు ఆ కార్పొరేటర్‌ను వాళ్ల పార్టీలోకి రానీయడంలేదన్నారు. దీంతో కొద్ది రోజులుగా ఏ పార్టీలో ఆదరణలేని కార్పొరేటర్‌గా మిగిలిపోయారన్నారు. ఇప్పుడు తిరిగి వచ్చినా వైఎస్సార్ సీపీ చేర్చుకోబోదని తేల్చిచెప్పారు. కార్పొరేటర్ పార్టీని వీడి వెళ్లినంత మాత్రాన కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి పరిస్థితిలోనూ వార్డులో కార్యకర్తలకు అండగా నిలుస్తామని, వార్డులో ఏ అవసరమున్నా తాను ముందుంటానని ఆమె భరోసా ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజబాబు, గూడపాలి విక్టర్, వనం వరలక్ష్మి, సత్యాల సాగరికి, కె.శిరీషా, బేగం, కాకర గోవింద్, వంకర బాబూరావు, వానపల్లి ఈశ్వరరావు, వెంకటరెడ్డి, కె.సుబ్బారావు, ఇమంది సత్యనారాయణ, భాస్కరరావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.